క్లుప్తంగా

పులులు, పర్యావరణంపై చిత్రలేఖన పోటీలు



వేసిన బొమ్మలతో పిల్లలు

ఆరిలోవ: అంతర్జాతీయ పులులు దినోత్సవం సందర్భంగా శనివారం జూ ఎడ్యుకేషనల్ విభాగం సిబ్బంది డెయిరీఫారం దరి ఇందిరానగర్‌లో ఆనంద్‌మార్గ్ ఆశ్రమం పిల్లలకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పులులు, పర్యావరణంపై నిర్వహించిన పోటీల్లో పిల్లలు తమ ప్రతిభ కనబరిచారు. అనంతరం జూ సిబ్బంది వారికి పులులు, వాటి ఆహారం, ప్రవర్తనతో పాటు పర్యావరణంపై అవగాహన కలిగించారు. వన్యప్రాణులు, పర్యావరణాన్ని సంరక్షించడానికి అందరూ కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమం స్వామీజీ సౌమ్యానంద్ అవదూత, జూ సిబ్బంది పాల్గొన్నారు.

కోలా గురువులుకు సత్కారం



కోలా గురువులను సత్కరిస్తున్న అక్కరమాని తదితరులు

ఎంవీపీకాలనీ: డీసీసీబీ చైర్మన్‌గా ప్రమాణం చేసిన కోలా గురువులను శనివారం తూర్పు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ఆధ్వర్యంలో శనివారం డీసీసీబీ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ కోసం నిస్వార్థంతో పనిచేసిన వారికి ఎప్పుడు సముచిత స్థానం ఉంటుందన్నారు. కోలా గురువుల విషయంలో మరోసారి ఇది నిజమైందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడిగా, డీసీసీబీ చైర్మన్‌గా కోలా గురువులు మంచి సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కార్పొరేటర్లు, వార్డు ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహ ప్రతిష్టకు రాట మహోత్సవం

సీతమ్మధార: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి రామాలయం వద్ద వైఎస్ జగన్ యువసేన ఆధ్వర్యంలో వినాయచవితి మహోత్సవాలకు శనివారం రాట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గం నాయకులు అక్కరమాని వెంకటరావు, 27వ వార్డు అధ్యక్షుడు నీలాపు సర్వేశ్వరరెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

నూతన డీఆర్‌ఎంకు అభినందనలు

ఉక్కునగరం: ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ నూతన డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్‌కు స్టీల్‌ప్లాంట్ ఉన్నతాధికారులు అభినందనలు తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జ్ బి.కె. మొహంతి నేతృత్వంలో సీజీఎం (మిల్స్, లాజిస్టిక్స్ అండ్ వర్క్స్ కాంట్రాక్ట్) యు. శ్రీధర్, మార్కెటింగ్ ఇన్‌చార్జ్ జీఎం, సీడీవై జీఎం ఇన్‌చార్జులు డీఆర్‌ఎంను ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రైల్వే, స్టీల్‌ప్లాంట్ మధ్య సంబంధాలు మరింత బలోపేతం కావాలని ఆకాంక్షించారు. స్టీల్‌ప్లాంట్‌కు పూర్తి సహకారం అందించాలని వారు కోరారు.

కార్మికుల చేతుల్లో స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భవిష్యత్తు ఉక్కు కార్మికుల చేతుల్లో ఉందని స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ (ఐఆర్) జనరల్ మేనేజర్ కె. సంజీవరావు అన్నారు. కోక్‌ఓవెన్స్ విభాగంలో శనివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ప్లాంట్ గతంలో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొందన్నారు. ఉద్యోగుల సమష్టి కృషి వల్ల అనేక అవరోధాలను ఎదుర్కొని ముందుకు సాగిందన్నారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొని ముందుకు సాగేందుకు ఉద్యోగులందరూ సహకారం అందించాలని ఆయన కోరారు.

పచ్చదనంతో కళకళ





ముడసర్లోవలో రహదారి మధ్యలో డివైడర్లపై పూల మొక్కలు

ఆరిలోవ: ముడసర్లోవ రహదారులు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. ఓ పక్క పచ్చని కొండలు, మరో పక్క రిజర్వాయరు..రెండు కిలోమీటర్లు పొడవున విశాలమైన రహదారుల మధ్య డివైడర్లపై మొక్కలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఆరిలోవ కాలనీ నుంచి రామకృష్ణాపురం వద్ద బీఆర్‌టీఎస్ కూడలివరకు రహదారి ఉంది. గతంలో ఆరిలోవ నుంచి సింహాచలం వైపు వెళ్లేవారు ఈరోడ్లనే వినియోగించేవారు. కొన్నాళ్ల తర్వాత నగరంలో పలు ప్రాంతాలు నుంచి లారీలతో తీసుకొచ్చిన గృహ వ్యర్థాలు ఇక్కడే డంప్ చేసేవారు. దీంతో పాటు రోడ్లకిరువైపులా పిచ్చి మొక్కలతో నిండిపోయి అస్తవ్యస్తంగా మారిపోయింది. వాహనచోదకులు రోడ్లపై ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. ఆరోడ్లపై జీవీఎంసీ దృష్టిసారించింది. ఈ ఏడాది మార్చిలో జరిగిన జీ–20 సదస్సు కోసం జీవీఎంసీ అధికారులు ఈ ప్రాంతాన్ని సుందరంగా తయారు చేశారు. ఈ సదస్సుకు హాజరైన మన దేశంతో పాటు విదేశీ ప్రతినిధులు ముడసర్లోవ రిజర్వాయరులో జీవీఎంసీ నిర్వహిస్తున్న ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్‌ను సందర్శించారు. దీని కోసం ఈ ప్రాంతం సుందరీకరణలో భాగంగా రహదారులను మెరుగు పరిచారు. రహదారి మధ్య డివైడర్ల కారిడార్లలో పచ్చదనం, అందం కోసం వివిధ రకాల పువ్వుల మొక్కలు ఏర్పాటు చేశారు. ఈ మొక్కలు ఇప్పుడు పచ్చదనంతో పాటు రంగుల పువ్వులతో కళకళలాడుతున్నాయి. ఈ రోడ్లపై ప్రయాణించేవారికి ఆహ్లాదాన్ని ఇస్తున్నాయి.

వైభవంగా శ్రీవారి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

ఎంవీపీకాలనీ: విశాఖ సాగరతీరన శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ, వైదిక విజ్ఞాన విపంచి సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి శ్రావణ మాసోత్సవ సప్తాహం కార్యక్రమాలు శనివారం కొనసాగాయి. వైదిక ధర్మ ప్రకారం ఈ సంస్థలు ఎంవీపీ కాలనీ టీటీడీ కల్యాణ మండపంలో ఈ ఆధ్యాత్మిక, శ్రీవారి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఉదయం శ్రీ వేంటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా ఈ కార్యకమం నిర్వహించారు. దీంతో పాటు అర్చన కార్యక్రమం కూడా జరిగింది. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా యువతుల సంగీత, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నిర్వాహకులు వారికి సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విశాఖ సాగరతీర శ్రీవారి కార్తీక దీపోత్సవ కమిటీ ప్రతినిధి హిమాంశు ప్రసాద్ మాట్లాడుతూ ఆగస్టు రెండో తేదీ వరకు ఈ కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఆదివారం ఉదయం శ్రీ వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు, సాయంత్రం నాట్య ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు.

మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు



పాత వెంకోజీపాలెంలో మ్యాన్‌హోల్‌పై మూత ఏర్పాటు చేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో పాత వెంకోజీపాలెంలో ప్రమాద భరితంగా మారిన మ్యాన్‌హోల్‌ను ఎట్టకేలకు భూగర్భ డ్రైనేజీ సిబ్బంది మరమ్మతులు చేశారు. ప్రమాదకరంగా మ్యాన్‌హోల్ శీర్షికన సాక్షిలో ఇటీవల ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. మ్యాన్‌హోల్‌కు సంబంధించి సమాచారం అందించిన మద్దాల శ్రీనివాస్ సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

స్పోర్ట్స్ ఎరీనా నిర్వహణ జీవీఎంసీయే చేపట్టాలి



ఎరీనా ఎదుట నిరసన చేస్తున్న వార్వా, నివాస్ ప్రతినిధులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీలో నూతనంగా నిర్మించిన ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా నిర్వహణ బాధ్యతలు జీవీఎంసీ చేపట్టాలని వార్వా, నివాస్ సంస్థలు డిమాండ్ చేశాయి. శనివారం ఇండోర్ స్పోర్ట్స్ ఏరీనా ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సహానీ అనే ప్రైవేట్ సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించడాన్ని నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వార్వా జోన్–3 కార్యదర్శి కుమార్ మంగళం మాట్లాడుతూ జీవీఎంసీ కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఇండోర్ స్పోర్ట్స్ ఏరీనా నగరంలో సామాన్యులకు సైతం అందుబాటులో ఉండాలన్నారు. ఇందుకు విరుద్ధంగా ప్రజాధనంతో నిర్మించిన ఈ ఎరీనాను ధనవంతులకు మాత్రమే అందుబాటులోకి ఉంచడమేంటని జీవీఎంసీని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వార్వా జిల్లా అధ్యక్షుడు ఎస్ ప్రకాశరావు, జోన్–3 అధ్యక్షుడు జేపీ శర్మ, రమాప్రభ, జీవీ రమణ, లక్ష్మణరావు, కొదండ, రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు చిత్రకళా ప్రదర్శన.. చిత్రలేఖనం పోటీలు

దాబాగార్డెన్స్ : కళని, కళా సంస్కృతిని పెంపొందించాలనే ముఖ్య ఉద్దేశంతో ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో కళాయజ్ఞ–జీవన రేఖలు ఏకవర్ణ చిత్రకళా ప్రదర్శన ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు నిర్వాహకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవనరేఖలు చిత్రకళా ప్రదర్శన ఉదయం 10 గంటలకు ఏయూ ఫైన్‌ఆర్ట్స్‌లో ప్రొఫెసర్ శిష్టా శ్రీనివాస్ ప్రారంభించనున్నారని, అలాగే మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు ఒకటి నుంచి తొమ్మిదో తరగతి చదువుతున్న పిల్లలకు ఎలాంటి ప్రవేశ రుసుం లేకుండా చిత్రలేఖన పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు.

వార్డు సమస్యల పరిష్కారానికి వినతి



వైవీ సుబ్బారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ అప్పారావు

మద్దిలపాలెం/ఏయూక్యాంపస్: నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డికి, మంత్రి విడదల రజినికి వినతిపత్రాలు అందజేశారు. 16వ కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీడైరెక్టర్ మొల్లి అప్పారావులు శనివారం తూర్పు నియోజకవర్గ సమీక్ష సమావేశంలో వైవీసుబ్బారెడ్డికి, మంత్రి విడదల రజినికి వినతి పత్రాలను అందజేశారు. వార్డులో కేఆర్‌ఎంకాలనీలో చెరువు పోరంబోకు స్థలం సమస్యతోపాటు, స్థానికంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రం అందజేశారు. అలాగే 20 వార్డు సమస్యలను పరిష్కరించాలని ఆ వార్డు కార్పొరేటర్ మువ్వల లక్ష్మి మంత్రి విడదల రజినికి వినతి పత్రం అందజేశారు.

ఉత్సాహంగా 'ఈట్ రైట్ మేళా'

- మిల్లెట్ మేళాలో ఆకట్టుకున్న స్టాల్స్
- అధిక సంఖ్యలో హాజరైన స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు



వాకథాన్‌లో పాల్గొన్న ఉక్కు నగర వాసులు




మిల్లెట్స్ మేళాలో స్టాల్‌ను పరిశీలిస్తున్న సీఎండీ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో ఈట్ రైట్ మిల్లెట్ మేళాకు విశేష స్పందన లభించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ), స్టీల్‌ప్లాంట్ సంయుక్తంగా ఉక్కు మల్టీపర్పస్ హాల్లో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్ భట్, ఎఫ్ఎస్ఎస్ఏఐ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ అరుల్ ఆనంద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా అతుల్ భట్ మాట్లాడుతూ ప్రజల్లో పెరుగుతున్న ఆరోగ్య స్పృహతో చిరు ధాన్యాలకు డిమాండ్ పెరిగిందన్నారు. దైనందిన జీవితంలో మిల్లెట్స్ వినియోగం, ప్రాధాన్యం గురించి డాక్టర్ అరుల్ ఆనంద్, సదరన్ ఇంటర్నేషనల్ హోటల్ మేనేజ్‌మెంట్ అకాడమీ ప్రిన్సిపాల్ జి. జయలక్ష్మి, క్యూ1 ఇంటర్నేషనల్ ఫుడ్స్ సీఈఓ ఎస్. సుజాత శ్రీనివాస్, విశాఖ డెయిరీ ఎండీ ఎస్.వి.రమణ, శ్రావణ్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ జి. సాంబశివరావు తదితరులు వివరించారు. మేళాలో సృష్టి వరల్డ్ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన మిల్లెట్లు, మిలెట్లతో చేసిన వంటకాలను సీఎండీ అతుల్‌భట్ అభినందించారు.

ఉక్కు సెక్టార్లలో 'వాకథాన్'

ఈట్ రైట్ ఇండియా – 'సురక్షితంగా తినండి– ఆరోగ్యంగా తినండి– స్థిరంగా తినండి' నినాదంతో ఉక్కునగరంలో శనివారం ఉదయం నిర్వహించిన వాకథాన్ ఉత్సాహంగా సాగింది. ముందుగా స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ (కమర్షియల్) డి.కె.మొహంతి, డైరెక్టర్ (పర్సనల్) ఎస్.సి. పాండే జెండా ఊపి వాకథాన్ ప్రారంభించారు. సెక్టార్– 5 నుంచి సెక్టార్–1 మీదుగా అంబేడ్కర్ కళాక్షేత్రం గుండా సెక్టార్–6 వరకు వాకథాన్ సాగింది. అంతకు ముందు క్లబ్ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల విజేతలకు స్టీల్ ప్లాంట్ జనరల్ ఆస్పత్రి సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు తమ కుటుంబ సభ్యులతో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధ్యాయులదే కీలకపాత్ర



మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

గోపాలపట్నం: విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో గొప్పదని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల సంఘం(అపుస్మా) రాష్ట్ర చీఫ్ మెంబర్, రామకృష్ణ పాఠశాల యజమాని ఎ.రామకృష్ణారెడ్డి అన్నారు. ఎన్ఏడీలోని రామకృష్ణ పాఠశాలలో శనివారం టీచర్ ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి స్వేచ్ఛగా తమ సందేహాలను అడిగే విధంగా టీచర్, విద్యార్థి మధ్య సంబంధాలు ఉండాలన్నారు. ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థి అని.. ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకుని తరగతి గదిలో విద్యార్థులకు బోధించాలన్నారు. అనంతరం రీసోర్స్ పర్సన్లు హైస్కూల్ ఉపాధ్యాయులకు విద్యా బోధనలో మెళకువలు నేర్పించారు. ఈ తరగతులకు జిల్లాలోని 65 పాఠశాలల నుంచి 300 మందికి పైగా ఉపాధ్యాయులు హాజరయ్యారు. అపుస్మా జిల్లా అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, రాష్ట్ర కోశాధికారి ఎం.వి.రావు, జిల్లా కోశాధికారి జి.శేషగిరిరావు, పలు పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమాజానికి సేవ చేయడమే నిజమైన మానవత



సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న చైర్మన్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: సమాజానానికి నిరంతరం సేవ చేయడం మానవత సంస్థ లక్ష్యమని ఏయూ రిజిస్ట్రార్, మానవత సంస్థ ఏయూ శాఖ చైర్మన్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. శనివారం ఏయూ మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో నిర్వహించిన మానవత సంస్థ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజ హితమే మానవతతత్వమన్నారు. సమాజంలో శాంతిని నెలకొల్పే దిశగా సంస్థ సభ్యులు కృషి చేయాలని సూచించారు. పర్యావరణ చైతన్యం పెంపొందించడం, విద్యార్థుల్లో నైతిక విలువులు పెంపు, అనాథలకు చేయూత, మనోధైర్యం నింపడం, యువతకు కెరీర్ కౌన్సెలింగ్ కార్యక్రమాల నిర్వహణ చేపట్టాలన్నారు. రానున్న ఏడాది కాలంలో సమాజహిత కార్యక్రమాలను విరివిగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఏయూ శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.ఏ.డి పాల్, కో చైర్మన్ ఆచార్య కె.సీతామాణిక్యం, కన్వీనర్ డాక్టర్ కె.రాజ మాణిక్యం, కార్యదర్శి డాక్టర్ జి.రవి కుమార్, సంయుక్త కార్యదర్శి నరేష్ రెడ్డి, కోశాధికారి డాక్టర్ ఎస్.రామకృష్ణ, పూర్వ చైర్మన్ ఆచార్య ఆర్.సుదర్శన రావు, పూర్వ అధ్యక్షులు ఆచార్య పరమేశ్వర రావు, ఆచార్య త్రినాథ్, డాక్టర్ సులేమాన్, డాక్టర్ ఎస్.హరనాథ్, డాక్టర్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరిపై మండిపడ్డ అఖిలపక్షం



సమావేశంలో పాల్గొన్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

దాబాగార్డెన్స్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరిపై అఖిలపక్ష రాజకీయ పార్టీలు మండిపడ్డాయి. ఆమె మాటలు వింటుంటే తెలుగు రాష్ట్ర ప్రజల కోసం కాకుండా.. కేంద్రంలోని బీజేపీకి తొత్తుగా మారినట్టు ఉన్నాయని ఎద్దేవా చేశారు. విశాఖ ఎంపీగా.. కేంద్ర మంత్రిగా పని చేసి విశాఖకు, ఆంధ్ర రాష్ట్రానికి ఏమీ చేయకపోగా.. రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్న బీజేపీ పంచన చేరి, ఆ పార్టీకి అనుకూలంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సీపీఎం కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో అఖిలపక్ష రాజకీయ పార్టీలు బీజేపీపై తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్ర విభజన చట్టంలోని అంశాలను ఏ ఒక్కటీ పూర్తి చేయకుండానే తప్పుడు ప్రచారానికి బీజేపీ నూతన అధ్యక్షురాలు పూనుకున్నారని ఎద్దేవా చేశారు. తాజాగా అదానీతో బీజేపీ సర్కారు కుమ్మక్కై స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికి తీవ్ర ఆటంకాలు సృష్టిస్తుందని ఆరోపించారు. బీజేపీ ఇప్పటికైనా కపట నాటకాలు, అబద్ధాలు ఆపి విశాఖ రైల్వేజోన్ నిర్మాణం వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. అటవీ హక్కుల సంరక్షణ చట్టంలో సవరణ బిల్లును ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించినా, లెక్క చేయకుండా బీజేపీ ఆమోదింపజేసిందన్నారు. దీంతో ఉత్తరాంధ్ర గిరిజనులు తీవ్ర ప్రమాదంలో పడ్డారని తెలిపారు. ఐదేళ్లలో రైల్వే జోన్‌కి ఎంత ఖర్చు పెట్టారు? ఎంత అభివృద్ధి చేశారో చర్చకు సిద్ధమా? అంటూ పురందేశ్వరికి బహిరంగ సవాల్ విసిరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డాక్టర్ బి. గంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మరుపిళ్ల పైడిరాజు, సీపీఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ) నాయకుడు వై. కొండయ్య, కె. శంకరరావు, కె. దేవ, ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కారు బోల్తా



బీఆర్‌టీఎస్‌లో డివైడర్‌పైకి దూసుకెళ్లిన కారు

ఆరిలోవ: బీఆర్‌టీఎస్ రోడ్డులో ఓ కారు బోల్తా పడింది. డివైడర్‌పైకి పైకి దూసుకుపోయి తిరగబడింది. ట్రాఫిక్ ఎస్.ఐ కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. హనుమంతవాక నుంచి అడవివరం వైపు కారులో ఓ వ్యక్తి బీఆర్‌టీఎస్ రోడ్డులో మధ్యలైన్‌లో వెళుతున్నాడు. ఆయన మితిమీరిన వేగంతో నడుపుతున్న కారు పైనాపిల్‌కాలనీ కూడలి ముందు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి పైకి బోల్తాపడింది. దీంతో కారులో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద శబ్దం రావడంతో కాలనీ వాసులు అక్కడకు పరుగున చేరుకొన్నారు. కారులో ఉన్న వ్యక్తిని బయటకు తీశారు. సంఘటన జరిగిన సమయంలో డివైడర్‌పై ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకొన్నారు. విషయం తెలుసుకొన్న ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కారును డివైడర్ పైనుంచి తొలగించారు.

అప్పుఘర్ కూడలిలో..

ఎంవీపీకాలనీ: అప్పుఘర్ కూడలిలో శనివారం మధ్యాహ్నం కారు బోల్తా పడింది. అతివేగంగా తెన్నేటి పార్కు వైపు నుంచి వస్తున్న కారు బోల్తా కొట్టింది. కారులో ఉన్న వ్యక్తులకు చిన్న చిన్న గాయాలతో బయటపడినట్టు ఎంవీపీ పోలీసులు తెలిపారు. ప్రమాదం అనంతరం కారును తొలగించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

కలెక్షన్ కింగ్

కొందరికి సేవ చేయాలనే తపన.. మరికొందరికి కళల్లో రాణించాలనే అభిలాష.. ఇంకొందరికి క్రీడల పట్ల మక్కువ.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో రంగంలో రాణించాలనుకుంటారు. రవిశంకర్‌రెడ్డి వివిధ దేశాల కాయిన్స్, స్టాంపుల సేకరణ అంటే ఆసక్తి చూపుతారు. దశాబ్దాల కిందటి బైకులు.. పాతకాలం నాటి ఏడు రకాల సైకిళ్లను తన ఇంట్లో మ్యూజియంగా ఏర్పాటు చేసుకున్నారు.

- పురాతన నాణాలు, స్టాంపుల సేకరణలో దిట్ట రవిశంకర్‌రెడ్డి
- తన సేకరణతో నాటి ప్రపంచం కళ్లకు కడుతుందంటూ ధీమా

SUNDAY SPECIAL



రూ.400 కాయిన్



రూ.175 కాయిన్



ట్రూ ఫ్రెండ్స్ పేరిట ముంబై మింట్ విడుదల చేసిన కలర్ కాయిన్

దాబాగార్డెన్స్ : నాణాలు.. పాత వాహనాలు.. పలు దేశాల స్టాంపులు, పురాతన కార్లను సేకరిస్తూ అభిరుచి చాటుతున్నారు రవిశంకర్‌రెడ్డి. ఏడు తరాల వృక్షమంటూ ఒక వర్ణచిత్రాన్ని రూపొందింపజేసి కొత్తగా నిర్మిస్తున్న ఇంటికి తగిలించారు. సాధారణంగా నాన్న.. తాత.. ముత్తాత వరకు ఎవరికైనా తెలుస్తుంది. కానీ ఏడు తరాల వారి పేర్లతో ఏర్పాటు చేసిన వంశవృక్ష చిత్రాన్ని తన ఇంటికి ఏర్పాటు చేసుకున్నారు. పురాతన చరిత.. అప్పటి సంప్రదాయాలను స్టాంపులు, భిన్నరకాల వస్తువులు తెలియజేస్తాయని రవిశంకర్‌రెడ్డి చెబుతుంటారు. విద్యార్థులు.. భావితరాలకు అవి స్ఫూర్తిగా నిలుస్తాయంటున్నారు. కంచరపాలెం ప్రాంతానికి చెందిన రవిశంకర్‌రెడ్డి విదేశీ కాయిన్స్, కరెన్సీతో పాటు పురాతన వస్తువులను సేకరించటంలో దిట్ట. 1957 నుంచి భారతదేశంలో వాడే ద్విచక్ర వాహనాలు ఆయన వద్ద ఉన్నాయి. అరుదైన భారతీయ నాణాలు, నోట్లను సేకరించడమే కాక, 122 దేశాల విదేశీ కరెన్సీ, డాలర్లు, 67 దేశాల స్టాంపులు సేకరించారు.


కాయిన్స్ ఇలా..

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్ 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కోల్‌కతా మింట్ విడుదల చేసిన రూ.50 మొదటి కాయిన్‌ను 2018లో రవి శంకర్‌రెడ్డి రూ.3580కు పొందారు. ఆ తర్వాత రూ.500 కాయిన్‌ను సాధించారు. నాలుగేళ్ల కిందట రూ.200 నాణెం సేకరించారు. మూడేళ్ల కిందట రూ.1000 నాణెం సొంతం చేసుకున్నారు. గతంలో రూ.10, రూ.20, రూ.100, రూ.150 వంటి కాయిన్లు సేకరించారు. ఏడాది కిందట రూ.75, రూ.350, రూ.550 నాణాలు సేకరించిన రవిశంకర్‌రెడ్డి, రాజ్యసభ 250వ సమావేశాన్ని పురస్కరించుకుని ముంబై మింట్ ఎనిమిది నెల కిందట విడుదల చేసిన రూ.250 కాయిన్‌ను కూడా సొంతం చేసుకున్నారు.

ఇటీవల కలెక్షన్లు..

గురుతేగ్ బహదూర్ 400వ జయంతి సందర్భంగా ముంబై మింట్ విడుదల చేసిన రూ.400 కాయిన్‌ను రవిశంకర్‌రెడ్డి రూ.4429కి చేజిక్కించుకున్నారు. అలాగే ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రారంభించి 175 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని ముంబై మింట్ ఇటీవల విడుదల చేసిన రూ.175 కాయిన్‌ను రూ.3,580కి కొనుగోలు చేసి విశాఖలో అరుదైన కాయిన్లు.. కరెన్సీ సేకరణలో కలెక్షన్ కింగ్‌గా నిలిచారు. అలాగే నూతనంగా ముంబై మింట్, కోల్‌కతా మింట్ చిన్నారుల నీతి కథలకు సంబంధించి పంచతంత్రంలో భాగంగా ఇటీవల విడుదల చేసిన 2 కలర్ కాయిన్స్, కోల్‌కతా మింట్ విడుదల చేసిన ఒక డాలర్ కాయిన్‌ను రవిశంకర్‌రెడ్డి సొంతం చేసుకున్నారు. మంకీ అండ్ క్రొకడైల్, ట్రూ ఫ్రెండ్స్ పేరిట ముంబై మింట్, క్రో అండ్ స్నేక్ పేరిట మంచి సందేశాత్మకాన్నిచ్చే కోల్‌కతా మింట్ విడుదల చేసిన కలర్ కాయిన్స్‌ను సొంతం చేసుకుని విశాఖ చరిత్రలో తొలి వ్యక్తిగా నిలిచారు.

చరిత్రను చాటి చెప్పాలనే..



పాత కాలం వస్తువులు.. పాత కరెన్సీ సేకరించడం చిన్నప్పటి నుంచి నా హాబీ. పైసా నుంచి ఐదు రూపాయలు, పది రూపాయలతో పాటు కోల్‌కతా.. ముంబై మింట్ వివిధ సందర్భాల్లో విడుదల చేసిన ఎన్నో కాయిన్స్‌ను సేకరించాను. మా ఇంటి నిండా 1957 నుంచి భారతదేశంలో వాడే ద్విచక్ర వాహనాలు, అరుదైన భారతీయ నాణాలు, నోట్లు ఉన్నాయి. 122 దేశాల విదేశీ కరెన్సీ, డాలర్లతో పాటు 67 దేశాల స్టాంపులు సేకరించాను. మన చరిత్రతో పాటు ప్రపంచ చరిత్రను కూడా తెలియజేసేలా నా సేకరణ ఉండాలని, విద్యార్థులకు స్ఫూర్తిగా నిలవాలనేది నా కోరిక.

– రవిశంకర్‌రెడ్డి, కాయిన్స్ కలెక్షన్ కింగ్, అడ్వెంచర్ స్పోర్ట్స్‌మేన్.

1 నుంచి దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కెథడ్రల్ చర్చి ఆధ్వర్యంలో 159వ దేవమాత మోక్షారోపణ మహోత్సవాలు ఆగస్టు 1 నుంచి నిర్వహించనున్నామని పునీత రాయప్ప ప్రధాన దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాశ్ తెలిపారు. శనివారం సెయింట్ పీటర్స్ చర్చి కమ్యూనిటీ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్ద కిందట జ్ఞానాపురంలో కలరా వ్యాధితో అనేక మంది ప్రజలు మృత్యువాత పడ్డారన్నారు. బిషప్ పీటర్ రోస్సియోన్ సూచన ప్రకారం అలయ విచారణ కర్తలు దేవమాత (మరియమాత) స్వరూపం జ్ఞానాపురంలో నేలకొల్పి పురవీధుల్లో తేరును ఊరేగింపు చేస్తే పరిస్థితులు అదుపులోకి వస్తాయన్నారని తెలిపారు. నాటి నుంచి ఆ కార్యక్రమం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆగస్టు 1 మంగళవారం సాయంత్రం స్లేవ్‌గుర్తు మండపంలో పతాకావిష్కరణ అనంతరం తిరువీధుల్లో తేరు (పల్లకి) ఊరేగింపు ఉంటుందన్నారు. ఆగస్టు 14 వరకు తేరు పలువీధుల్లో తిరుగుతుందని 15న జరిగే ప్రధాన మహోత్సవాలను విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ మల్లవరపు ప్రకాశ్ ఆధ్వర్యంలో దివ్యబలిపూజ, పుర:ప్రదక్షిణ, బహుమతి ప్రదానం, భారీ బాణసంచాతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆయన వెల్లడించారు. అనంతరం పీపీసీ (పారిస్ పాస్టల్ కౌన్సిల్) ఆధ్వర్యంలో ఉత్సవాల పోస్టరును ఆవిష్కరించారు. ఫాదర్లు పి. ప్రభాకర్, వేళంగిణీరావు, పీపీసీ అధ్యక్షుడు వై.అమర్‌దీప్, ఉపాధ్యక్షుడు ఆదిరెడ్డి చార్లీ పాల్గొన్నారు.